

సేవలు వినియోగించుకోవాలి

సంచార పశు వైద్యసేవలు వినియోగించు కోవాలని జీవీకే ఈఎంఆర్ఐ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి భగీస్ మిశ్రా అన్నారు. - 8లో



భారత్‌ను అగ్రస్థానంలో..

భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. -10లో



కులగణన తర్వాతే..

బీసీ కులగణన తర్వాతే పంచాయతీ ఎన్నిక లు నిర్వహించాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. - 10లో

ఎత్తులు.. పైఎత్తులు

ఉత్కంఠగా సూర్యాపేట మున్సిపల్ రాజకీయం

- అవిశ్వాసం నేపథ్యంలో ప్రలోభాల ఎర
- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా జట్టుకట్టిన 32 మంది కౌన్సిలర్లు
- బీఆర్ఎస్‌లో మిగిలింది 15మందే..
- ఒకరి సభ్యులను మరొకరు లాగేందుకు కాంగ్రెస్, గులాబీ పార్టీల ప్రయత్నాలు



పార్టీల బలాబలాలు	
బీఆర్ఎస్‌లో ఉన్న కౌన్సిలర్లు	15
బీఆర్ఎస్‌ను విభేదించింది	15
కాంగ్రెస్ పార్టీ	09
బీజేపీ	04
బీఎస్పీ	04
47వ వార్డు ఖాళీ	

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపల్ రాజకీయం ఉత్కంఠగా మారింది. ఈనెల 27న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఉండడంతో ఇరువర్గాలు ప్రలోభాలకు తెరలేపాయి. అవిశ్వాసం నెగ్గాలని కాంగ్రెస్ వైపు కౌన్సిలర్లు, వీగిపోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎవరికి వారు ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. మొత్తం 48 మంది సభ్యులు గల పేట మున్సిపాలిటీలో ఒక వార్డు ఖాళీగా ఉంది. ఇందులో 32 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా సంతకాలు చేసి అవిశ్వాస పత్రం కలెక్టర్‌కు అందజేశారు. వీరు ప్రస్తుతం శిబిరంలో ఉన్నారు. 30 మంది బీఆర్ఎస్ సభ్యులకు గాను 15 మంది సొంత పార్టీకి చెందిన చైర్మన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా ఉన్నారు. మరో 15 మంది చైర్మన్ వైపు ఉన్నారు. అయితే, అవిశ్వాసం పెట్టిన వారి నుంచి కొందరిని తమవైపు తిప్పుకోవాలని ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. నేరుగా కలవడంతో పాటుగా ఫోన్ కాల్స్ ద్వారా కౌన్సిలర్లను కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.పది లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బేరమాడుతున్నట్టు సమాచారం. అంతేకాకుండా తమ శిబిరంలోకి వచ్చే వారికి భారీ మొత్తంలో నగదుతో పాటుగా వైస్ చైర్మన్ పదవి కూడా ఇస్తామని అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది. వార్డుల్లో నెలకొన్న సమస్యలను చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ పట్టించుకోకపోవడంతోనే అవిశ్వాసం పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాంటిది ఇప్పుడు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పెట్టే ప్రలోభాలకు లొంగేదే లేదని పలువురు కౌన్సిలర్లు అంటున్నారు. అవిశ్వాసం వైపు నిలబడి నెగ్గిస్తారో లేక అవిశ్వాసం వీగేలా చేస్తారో వేచిచూడాలి.

చైర్మన్ పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్

అవిశ్వాసం ఎలాగైనా నెగ్గి పేట మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు భావిస్తున్నారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో పాటు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కూడా ఇదే ధీమాలో ఉన్నారు. ఇప్పటికే తీర్మానం లేఖ అందజేసి శిబిరంలోకి వెళ్లిపోయిన కౌన్సిలర్లకు వారు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. అవిశ్వాసం నెగ్గాలంటే సంతకాలు చేసిన 32 మంది కౌన్సిల్ సభ్యులతో పాటు మరొకరు అవసరం ఉంది. ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి శిబిరంలో ఉన్న సభ్యుల్లో ఒకరిద్దరిని లాగితేనే అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంది. దీంతో ఆ ఇద్దరిని లాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అవిశ్వాసం వీగిపోయేలా ఎమ్మెల్యే స్కెచ్

స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయేలా స్కెచ్ వేస్తున్నారు. 15మంది కౌన్సిలర్లలో సుమారు ఐదారుగురిని హైదరాబాద్ క్యాంపునకు తరలించారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు విదేశీ పర్యటనలో ఉన్నారు. అవిశ్వాసం పెట్టిన సభ్యుల్లో కొందరి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు.

చైర్‌పర్సన్ రేసులో కొండపల్లి నిఖిల

మున్సిపల్ చైర్‌పర్సన్ రేసులో 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల ఉన్నారు. ఈమె భర్త దిలీప్‌రెడ్డి బీఆర్ఎస్ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలకు చెందిన 32మంది కౌన్సిలర్లను హైదరాబాద్ శిబిరానికి తరలించారు. వైస్ చైర్మన్ రేసులో రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, కక్కిరేణి శ్రీనివాస్, పోలగాని కవితబాలుగౌడ్, బైరు శైలందర్‌గౌడ్, షేక్ జహీర్ ఉన్నారు.

ఇప్పటికే తీర్మానపత్రం అందజేత

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై ఈనెల 10న అవిశ్వాసం పెట్టాలని తీర్మాన లేఖను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. దీంతో కలెక్టర్ ఆ లేఖను మున్సిపల్ కమిషనర్‌కు పంపి కౌన్సిల్ సభ్యులు చేసిన సంతకాలపై విచారణ చేసి పంపించారు. వెంటనే కలెక్టర్ కౌన్సిల్ సభ్యులకు నోటీసులు అందజేశారు. ఈనెల 27వ తేదీన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం పెట్టాలని నిర్ణయించారు. బీఆర్ఎస్‌కు చెందిన 30 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పోకడలు నచ్చక 15 మందితోపాటు కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలకు చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసానికి తెరలేపారు.

న్యూస్‌రీల్

ప్రాచీన కళాసంపదను కాపాడాలి



కోనేరు పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

ఆత్మకూర్(ఎస్): ప్రాచీన కళాసంపదను కాపాడి భావితరాలకు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం ఆమె ఆత్మకూర్(ఎస్)మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవాలయం ఎదురుగా ఉన్న ప్రాచీన మెట్లబావి(కోనేరు) పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశాన్ని పాలించిన రాజులు ఎన్నో గొప్ప కట్టడాలు కట్టారని, నేడు అవి శిథిలావస్థకు చేరాయన్నారు. వాటికి మరమ్మతులు చేసి నేటి తరానికి వారసత్వంగా అందించాలన్నారు. అనంతరం నెమ్మికల్, పాతసూర్యాపేట గ్రామపంచాయతీ కార్యాయాల్లో రికార్డులు, ఆయా గ్రామాల్లోని జిమ్ సెంటర్లను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ మల్సూర్ నాయక్, ఎంపీఓ సంజీవ, ఏపీఓ ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు మర్ల చంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

చివ్వెంల: సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నికను శుక్రవారం మండలంలోని దురాజ్‌పల్లిలో నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఐతరాజు చెన్నయ్య, ఉపాధ్యక్షుడిగా సంగిశెట్టి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా భానోతు చిన్న నాయక్, సంయుక్త కార్యదర్శిగా కొమ్ము ఐద్దయ్య, కోశాధికారిగా టి.పద్మావతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడు సంవత్సరాల పాటు పనిచేస్తుందని సభ్యులు తెలిపారు.

తూకాల్లో తేడా వస్తే కేసులు నమోదు చేస్తాం



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తూకాల్లో తేడా వస్తే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల జిల్లా అధికారి కందగట్ల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం చింతలపాలెం మండల కేంద్రంతోపాటు, దొండపాడులలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. కాంటాలను, బాట్లను, వాటిపై ముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు వినియోగదారులను తూకాలు, కొలతల్లో మోసం చేయొద్దని సూచించారు.

జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ విజేతల జాబితా విడుదల

సూర్యాపేట టౌన్: ఈనెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉప అంశాల వారీగా విజేతల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ శుక్రవారం విడుదల చేశారు. జిల్లా స్థాయిలో విజేతలైన విద్యార్థులు ఈనెల 22న సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో ప్రాజెక్టులు సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జూనియర్ విభాగంలో ఐదు పాఠశాలల ప్రాజెక్టులు, సీనియర్ విభాగంలో ఐదు పాఠశాలల ప్రాజెక్టులు ఎంపికైనట్టు తెలిపారు. అలాగే టీచర్ ఎగ్జిబిషన్, సెమినార్‌లో ఇద్దరు టీచర్లు ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరంతా రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్టు చెప్పారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్ సెల్:9989457087 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

22న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పర్వతం సంధ్యారాణి

సూర్యాపేట టౌన్: అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఈ నెల 22న సోమవారం జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజా వ్యతిరేక విధానులు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు కార్మికులు, కర్షకులను ఏకంకావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేటలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక, కర్షక ఐక్యత జిల్లా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించడం, 3 రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తేవడం దుర్మార్గమన్నారు. ఈ సదస్సులో ఆయా సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాంబాబు, ములకలపల్లి రాములు, బుర్రి శ్రీరాములు, నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ హర్షణీయం

భానుపురి (సూర్యాపేట): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విజయవాడ నగరంలో దేశంలోనే అతిపెద్దదైన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం హర్షణీయమని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్ అన్నారు. శుక్రవారం విజయవాడలో జరగనున్న అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బయలుదేరుతూ సూర్యాపేటలోని రైతుబజారులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. విగ్రహాన్ని ఆవిష్కరించడమంటే జ్ఞానాన్ని అందించమే అన్నారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు అనుములపురి కృష్ణ, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు చింతపల్లి వెంకటేశ్వర్లు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది బొల్లెద్దు వెంకటరత్నం, మాల మహానాడు న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, నామా వేణు, కళ్యాణ్, శ్రీను, గోపి పాల్గొన్నారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



ఇమాంపేట కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

- కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని సబ్జెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో స్కూల్ ఆవరణలో విద్యతోపాటుగా ఇతర అంశాలలో వారికి ఉన్న ఆసక్తిని ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో తాగు నీరు, టాయిలెట్లను మరమ్మతులు చేసి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నాలుగు కేజీబీవీల్లో ఆటలు, నాటక రంగాల్లో నైపుణ్యత సాధించేందుకు పీఈటీలు, మాస్టర్‌లను తాత్కాలిక పద్ధతిలో నియమించినట్లు తెలిపారు. మార్చి 14 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కస్తూరిబాలోని మైనార్టీ విద్యార్థులు అరబిక్ టీచర్ కావాలని కోరగా వెంటనే నియామకం చేపట్టాలని కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటుగా అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, ఎస్ఓ అనిత, సెక్టోరల్ అధికారి రాంబాబు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. వాటరింగ్ డే సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని 34 వార్డు పరిధిలో గల కలెక్టరేట్ రోడ్డులో హరితహారం మొక్కలకు నీళ్లు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు వాటరింగ్‌డేలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సీఎంఆర్ గడువులోగా అందించాలి





మాట్లాడుతున్న కలెక్టర్, సమావేశానికి హాజరైన మిల్లర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఖరీఫ్ సీజన్-2022-23 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ప్రభుత్వం విధించిన గడువు ఈనెల 31 నాటికి అందించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి.. మిల్లర్లతో సమావేశం నిర్వహించగా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2022-23 ఖరీఫ్‌లో సేకరించిన 3,13,333 మెట్రిక్ టన్నుల దాన్యాన్ని 59 మిల్లులకు అందించామని, 2,10,261 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,72,027 మెట్రిక్ టన్నులే అందించారన్నారు. 83 శాతం లక్ష్యం పూర్తయిందని మిగిలిన 17 శాతం గడువులోగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం రాంపతి, డీఎస్ఓ మోహన్‌బాబు, మిల్లర్లు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. దొడ్డా నర్సయ్య



దొడ్డా నర్సయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



చిలుకూరులో దొడ్డా నర్సయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చిలుకూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య నేటితరానికి ఆదర్శప్రాయుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం చిలుకూరులో దొడ్డా నర్సయ్య 25వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. దొడ్డా నర్సయ్య.. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ఈ ప్రాంతం నుంచి ముఖ్య భూమిక పోషించారని కొనియాడారు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందంటున్న పార్టీలే దిక్కులేకుండా పోతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కమ్యూనిస్టులంతా ఐక్యంగా కలిసి పనిచేయాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ తరఫున అన్ని స్థానాల్లో పోటీ చేసి తమ సత్తా చాటాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతకు ముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, సీనియర్ నేత దొడ్డా నారాయణరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనంతుల మల్లేశ్వరి, పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, ఆర్థికవేత్త అందె సత్యం, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు కొండా కోటయ్య, మేకల శ్రీనివాస్‌రావు, యల్లావుల రాములు, ధనుంజయనాయుడు, చేపూరి కొండలు, సాహెబ్‌అలీ, చిలువేరు ఆంజనేయులు, దొడ్డా వెంకటయ్య, బాలెబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో మానసిక ఉల్లాసం



క్యారమ్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్

చివ్వెంల: క్రీడాపోటీలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్నేహ భావంతో క్రీడల్లో పాల్గొనాలని, గెలుపోటములు సహజమన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రశాంత వాతావరణంలో క్రీడాపోటీలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి, ఎస్.అమరావతి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేసన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్య యాదవ్, గేమ్స్ సెక్రటరీ కోక రంజిత్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఉప్పలయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎన్నికల నగారా

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పోరుకు ప్రభుత్వం ఉత్తర్వులు
- 29న ఎన్నికలు నిర్వహించాలని ఆదేశం
- నేడు విడుదల కానున్న నోటిఫికేషన్
- 1 నుంచి 8వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీ చేసే అవకాశం



హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పాఠశాలల వివరాలు	
ప్రాథమిక	701
ప్రాథమికోన్నత	81
ఉన్నత	243
కేజీబీవీలు	18
మోడల్ స్కూళ్లు	09
సంక్షేమ గురుకులాలు	08
మైనార్టీ వెల్ఫేర్	04
మదర్సాలు	02
మినీ గురుకులం	01
అర్బన్ రెసిడెన్షియల్	01
మొత్తం	1,068

సూర్యాపేట టౌన్, హుజూర్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొననుంది. పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాఠశాల స్థాయిలో ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లను 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను సభ్యులుగా చేతులెత్తి ఎన్నుకోనున్నారు. చివరి సారిగా 2019 నవంబర్‌లో ప్రభుత్వం ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నికలు నిర్వహించింది. ఇప్పటి వరకు కమిటీల పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది.

నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం

ఈనెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీని ఎన్నుకోనున్నారు. ఇందుకు సంబంధించి ప్రక్రియ శనివారం నోటిఫికేషన్ విడుదల కానుంది. మొదట పాఠశాల పరిధిలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనే విధంగా హెచ్ఎం శనివారం ఉదయం నోటీసు జారీ చేయాల్సి ఉంటుంది. అదేరోజు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నోటీసు బోర్డులపై తల్లిదండ్రుల జాబితా ప్రదర్శన ఉంటుంది. 22, 23 తేదీల్లో జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 24న పాఠశాలల్లో నోటీసు బోర్డులపై తల్లిదండ్రుల తుది జాబితా ప్రదర్శన ఉంటుంది. 29న నూతన ఎస్ఎంసీల సభ్యులకు ఎన్నికల నిర్వహణ, కొత్త ఎస్ఎంసీల ఏర్పాటు ఉంటుంది. అదే రోజు ఎస్ఎంసీ సభ్యులచే చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక తొలి సమావేశం జరుగుతుంది.

ఎన్నిక విధానం ఇలా..

1 నుంచి 8వ తరగతి వరకు ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకుంటారు. వారిలో విధిగా ఇద్దరు మహిళలుండాలి. స్కూల్ హెచ్ఎంలు సభ్యులుగా ఉంటారు. వీరే కాకుండా స్థానిక వార్డు మెంబర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, మహిళా సమాఖ్యల అధ్యక్షులు సభ్యులుగా ఉంటారు. ప్రాథమిక పాఠశాలలో 15మంది, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 21 మంది సభ్యులుగా ఉంటారు. ఆరుగురు ఎక్స్‌అఫీషియో, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారు. ఎన్నికైన సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

సంరక్షకుల్లో ఒకరే ఓటుకు అర్హులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిలల తల్లిదండ్రులే ఎస్ఎంసీల్లో సభ్యులుగా కొనసాగుతారు. కమిటీలో ఎన్నికైన వారు రెండేళ్ల పాటు పదవిలో ఉంటారు. ఎప్పుడైనా వారి పిల్లలు ఆ పాఠశాలను వదిలి వెళ్లితే వారి తల్లిదండ్రులు పదవిని కోల్పోతారు. ఓటర్ల జాబితాలోని తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుల్లో ఒకరే ఓటుకు అర్హులు. ఓటర్లలో 50 శాతం మంది హాజరు కాకుంటే కోరం లేనట్లే. సభ్యులు చేతులెత్తే పద్ధతి లేదా మూజువాణి ఓటుతో కమిటీని ఎన్నుకుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే రహస్య బ్యాలెట్ పద్ధతిన ఓటేస్తారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి



ప్రస్తుతం ఉన్న ఎస్ఎంసీల గడువు ముగియడంతో నూతన కమిటీలను ఎన్నుకోవడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి ఎన్నికలకు సంబంధించి శనివారం నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ నెల 29న ఎన్నికలు జరుగుతాయి. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల నిర్వహణకు సిద్ధమవ్వాలి.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

ఎస్ఎంసీల విధులు, బాధ్యతలు

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితరాలను ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్లు పర్యవేక్షిస్తారు. మనఊరు- మన బడి పనులు పరిశీలిస్తారు. మూత్రశాలలు, తాగునీరు, మైదానాలు, క్రీడా సామగ్రి తదితర సమస్యలను ప్రజాప్రతినిధులు, ఇతర దాతల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషిచేయాలి. పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. పాఠశాల నిర్వహణ నిధులు హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్‌ల ఉమ్మడి ఖాతాలో జమవుతాయి. వీటిని ఆయా పాఠశాలల అభివృద్ధికి వినియోగించాలి,

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

రాజాపేట : విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన రాజాపేట మండలంలోని రఘునాథపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దేవనపల్లి సిద్దులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. వీరందరికీ వివాహాలయ్యాయి. చిన్న కుమార్తెకు నెల రోజుల క్రితం పాప జన్మించగా తల్లిగారింటికి వచ్చి ఉంటోంది. సిద్దులు కొడుకు రామకృష్ణ కుమార్తె వేదశ్రీ (18నెలలు) ఆడుకుంటూ ఇంటి డాబాపైకి వెళ్లి పక్కనే ఉన్న రేకులపైకి వెళ్లింది. ఈ విషయాన్ని గమనించిన నాయినమ్మ చంద్రకళ పడిపోతుందని పరుగున వెళ్లి కాపాడే ప్రయత్నంలో పైనున్న 11 కేవీ విద్యుత్ తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో పెద్ద శబ్దం రావడంతో చంద్రకళ కుమార్తె పుట్ట నిర్మల తల్లిని కాపాడే ప్రయత్నంలో ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. తల్లి కూతుళ్లకు తీవ్ర గాయాలు కావడంతో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిర్మల పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఆత్మకూర్ (ఎస్) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆత్మకూర్-ఎస్ మండల పరిధిలోని పాతర్లపహాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతర్లపహాడ్ ఎక్స్‌రోడ్డు విజయ కాలనీకి చెందిన రావుల చిన వీరయ్య(45) పాత ఇనుము బేరం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా వీరయ్య ఆర్థికంగా తీవ్ర ఇబ్బందిపడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కట్టా వెంకట్‌రెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డి గూడెం గ్రామానికి చెందిన జక్కలి రాములు (43) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15 రాములు బైక్‌పై వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా చెర్వుగట్టు ఆర్చి వద్ద బైక్ అదుపు తప్పి కిందపడడంతో రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గీత కార్మికుడు మృతి

అడ్డగూడూరు : అనుమానాస్పద స్థితిలో ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీదేవి కాల్వ గ్రామానికి చెందిన చిన్నవీరయ్యగౌడ్ (45) వ్యవసాయంతో పాటు కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరయ్య రోజూ మాదిరిగా తాటిచెట్లు ఎక్కి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం వరకు భోజనానికి ఇంటికి రాకపోవడంతో కుమారుడు మహేష్ బావి వద్దకు వెళ్లగా వీరయ్య విగతజీవుడిగా కనిపించాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మిర్చి పంటకు చీడపీడలు

- ఎండిపోతున్న మొక్కలు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



రాములమ్మ, సస్యరక్షణ శాస్త్రవేత్త

త్రిపురారం : ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో సుమారు 4,500 హెక్టార్లలో మిరప పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలు పూత, పిందె, కాత దశలో ఉన్నాయి. ఈ దశల్లో పలురకాల చీడ పీడలు ఆశించి పంటను నష్టపరుస్తున్నాయి. ముఖ్యంగా పలు రకాల వైరస్‌లు సోకి మొక్కలు అర్థంతరంగా ఎండిపోతున్నాయి. ఈ సమయంలో రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ సూచిస్తున్నారు. ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలు వారి మాటల్లోనే..



అడవిదేవులపల్లి మండలంలో మిరప పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కాయ కుళ్లు తెగులు

కాయ కుళ్లు తెగులు ఆశించడం వల్ల కొమ్మలు పైనుంచి కిందకు ఎండిపోతాయి. లేత కొమ్మలు, పూతకు తెగులు ఆశించడం వల్ల పూత రాలిపోతుంది. కాయలకు ఆశించప్పుడు కుళ్లిపోతాయి. కాయల మీద ఏర్పడిన నల్లని మచ్చలతో శిలీంధ్ర బీజాలు కనిపిస్తాయి. మిరప పంటలో కాయ కుళ్లు తెగులు నివారణకు ప్రోఫికోనాజోల్ 1 మి.లీ (లేదా) పైలోక్లైస్ట్రాటిన్+మిటిరమ్ 3 గ్రాములు (లేదా) ట్రిఫాక్స్‌స్ట్రాటిన్ + టెబుకొనజోల్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

తెల్లనల్లి పురుగులు

తెల్లనల్లి పురుగులు రసాన్ని పీల్చడంతో ఆకులు కిందకి ముడుచుకొని కాడలు సాగి ముదురు ఆకుపచ్చగా మారుతాయి. మొక్కల పెరుగుదల ఆగిపోయి లేత అకులు ముద్దలు ముద్దలుగా అవుతాయి. నివారణకు ఎకరాకు డైకోఫాల్ లీటరు నీటికి, నీళ్లల్లో కరిగే గంధం 600 గ్రాములు, నత్రజని ఎరువులు తగ్గిస్తే మంచిది.

మొక్క ఎండే తెగులు

మొక్కలు వడలిపోయి ఎండిపోతు పూత, పిందెలు రాలిపోతాయి. నివారణకు లీటరు నీటికి ఆక్సీక్లోరైడ్ కలిపిన ద్రావణంతో వడిలిపోయిన చెట్టు మొదళ్ల చుట్టు పక్కల తడిపి తగినంత నత్రజని నీటి తడులు ఇవ్వాలి.

కొమ్మకుళ్లు తెగులు

లేత చిగుళ్లు మాడిపోయి కొమ్మల కణువుల వద్ద కుళ్లు కనబడి కొమ్మలు విరిగిపోతాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, 1గ్రాము స్ట్రెప్టోసైకిల్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి

కాయతొలుచు పురుగు

కాయతొలుచు పురుగుల ఉధృతిని గుర్తించడానికి ఎకరాకు సుమారుగా 4లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవాలి. ఎరలను మాత్రం ప్రతి 25 రోజులకు ఒకసారి మార్చుకోవాలి. విషపు ఎరల ద్వార బాగా ఎదిగిన కాయతొలుచు పురుగుల నివారించుకోవచ్చు. 5కిలోల తవుడు 500 గ్రాముల బెల్లం, తగినంత నీటిని కలిపి తయారు చేసుకోవచ్చు. ఈ విధంగా తయారు చేసినవి చిన్న చిన్న గుళికలను సాయంత్రం వేళలో సమానంగా చల్లితే నేలల్లో దాగి ఉన్న పురుగులు రాత్రి సమయంలో బయటకు వచ్చి తిని చనిపోతాయి. లద్దె పురుగులు మొదటి దశలో ఆకులను నష్టపరిచిన తరువాత కాయల్లో చేరి గింజలను తింటాయి. నివారణకు థయోడికార్బ్ 200 గ్రా లేదా ఎసిఫేట్ 300 గ్రా స్పైనోసాడ్ 75 మి.లీ లేదా కిన్వాల్ పాస్ 400 మి.లీ ఉధృతిని బట్టి శాస్త్రవేత్తల సూచనల మేరకు పిచికారీ చేసుకోవాలి.

పాడి పంట

బుడిద తెగులు.. నివారణ చర్యలు

మిరప పంటలో బుడిద తెగులు ఆశించినప్పుడు మొదట ఆకు పైభాగం ఆకు పచ్చ రంగు కోల్పోయి పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకు అడుగు భాగంలో కాయలు, పూత పైన బూడిద రంగు మచ్చలు ఏర్పాడతాయి. బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు (లేదా) మేక్లేబ్యూటానిల్ 0.4 గ్రాములు (లేదా) అజోక్సిస్ట్రాబిన్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచాకారీ చేసుకోవాలి.

వైరస్ తెగుళ్లు

మిరప పంటను దాదాపుగా కొన్ని రకాల వైరస్ తెగుళ్లు ఆశించి నష్టపరుస్తుటాయి. వైరస్ తెగుళ్లు పంటపై వ్యాప్తి చెందడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పాడతాయి. ఆకుముడత, కుకుంబర్, మొజాయిక్, పీనట్ బడ్ నెక్రోసిస్ వంటి పలు రకాల వైరస్‌లు సోకే అవకాశం ఉంటుంది. రైతులు మిరప పంటలకు వచ్చే తెగుళ్లను సకాలంలో గుర్తించి శాస్త్రవేత్తల సలహాలను సూచనలతో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల పంటలను కాపాడుకొని అధిక దిగుబడులు సాధించవచ్చు.

నల్ల తామెర పురుగు

రెక్కల పురుగు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకుల అంచులు పైకి ముడుచుకుంటాయి. ఆకులు, పిందెలు రాగి రంగులోకి మారి పూత పిందె నిలిచి పోతుంది. దీని నివారణకు నీలి రంగు, తెలుపు రంగు, జిగురు అట్టాలను ఎకరాకి 20నుంచి 30 చోట్ల అమర్చుకోవాలి. వేప పూలను 3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. బవేరియా, బసియానా, లేదా లకానిసిల్లియం లకాని వంటి జీవ శిలీంధ్ర నాశినిలు లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. ఫిప్రోనిల్ 2 గ్రాములు లేదా సయాంత్రనిలిప్రోల్ 1025 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా బెండిమైడ్, థయాక్లైఫ్రిడ్ 0.5 మి లీ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2 నుంచి 5 సార్లు పిచికారీ చేసుకోవాలి.

పేను బంక

పేను బంక లేత కొమ్మల అకుల అడుగున చేరి రసాన్ని పీల్చడంతో పెరుగుదల తగ్గుతుంది. కొన్ని పదార్థాలను విసర్జించడంతో చీమల ఆకర్శిస్తుంది. ఆకులు, కాయలు నల్లగా మసి పూసినట్లు మారిపోతాయి. నివారణకు ఎకరానికి మిథైల్ డెమటాన్ 400 మి.లీ లేదా ఎసిఫేట్ 300 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 60 మి.లీ పిచికారీ చేసుకోవాలి.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



షేక్ కరిష్మా

హుజూర్‌నగర్‌రూరల్ : జాతీయస్థాయి అండర్ 14 బాలికల కబడ్డీ పోటీలకు హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన బాలిక షేక్ కరీష్మా ఎంపికైంది. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి తెలంగాణ రాష్ట్ర అండర్-14 బాలికల కబడ్డీ జట్టుకు కరీస్మా ఎంపికైనట్లు ఆమె తండ్రి షేక్ మహమ్మద్ శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడపలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున బాలిక పాల్గొంటుందని తెలిపారు. కాగా బాలిక తండ్రి మహ్మద్‌తో పాటు పెదనాన్న షేక్ లాల్‌మదార్‌లు కూడా కబడ్డీలో జాతీయ స్థాయి క్రీడాకారులు. వీరు స్పోర్ట్స్ కోటాలోనే పోలీసు శాఖలో ఉద్యోగాలు సాధించారు. బాలిక ఎంపిక పట్ల సర్పంచ్ షేక్ సలీమారంజాన్‌తో పాటు పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

తిరుమలగిరి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు..

˘$I§ W (ПЭ⁄˘ §I °V§) : జార్ఖండ్ రాష్ట్రంలో ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు తిరుమలగిరి (సాగర్) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోమళ్ల ధనూష్, పానుగోతు నాగరాజులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. జనగామలో ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధనూష్, నాగరాజులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస్, పీఈటీ ఎక్కలూరి సునితతో పాటు ఉపాధ్యాయులు అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నోవా, రెడ్యా నాయక్, వినయ్‌కుమార్, పార్వతమ్మ, భాను, మధుసూదన్, విజయ్ భాస్కర్‌రెడ్డి, రాహెల్ కుమారి, శశిధర్‌రెడ్డి, చంద్రకళ, మోతీలాల్, వెంకటేశ్వర్లు, లచ్చిరాం, నాగరాజు పాల్గొన్నారు.



తిరుమలగిరి: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు

బ్లాస్టింగ్ చేస్తున్న ముగ్గురిపై కేసు

బొమ్మలరామారం : అనుమతులు లేకుండా బండ రాళ్లను బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తులపై శుక్రవారం బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన అర్రా వెంకట్ రెడ్డి, శివరాత్రి కృష్ణ, పల్లపు శ్రీనులు శుక్రవారం బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామ శివారులో గల షామీర్ పేట్ వాగులో బండ రాళ్లను బ్లాస్టింగ్ చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఘటన స్థలంలో గల 300 జిలెటిన్ స్టిక్స్, వైర్లు, రెండు కంప్రెషర్ వాహనాలు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ బ్రెయిన్ డెడ్

- చికిత్సకు రూ.లక్షలు ఖర్చు
- దాతలు సాయమందించాలని వేడుకోలు

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలం జంకు తండా గ్రామపంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన విజయశ్రీ బ్రెయిన్ రెండు రోజుల క్రితం డెడ్ అయింది. ఇటీవల విజశ్రీకి బీపీ (రక్తపోటు) పెరగడంతో కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించగా బ్రెయినఖ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. తమది పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారిందని అంగన్‌వాడీ టీచర్ భర్త శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. ఆర్థికసాయం చేయాలనుకునే వారు 6304583270 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా, ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 52122707243 ద్వారా సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఉరేసుకుని బలవన్మరణం

నార్కట్‌పల్లి : ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఒడిశాకు చెందిన అమ్రోజు శివ (34) నల్లగొండలో ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం నార్కట్‌పల్లి మండలంలోని దాసరిగూడేని చెందిన కొమ్మనబోయిన సైదులు ఇంటికి వచ్చాడు. ఓ గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకొని చీరతో స్లాబ్ కొక్కానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కృష్ణవేణి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు.

న్యూ క్రెటా కారు విడుదల



క్రెటా కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ రూరల్ : మార్కెట్‌లోకి నూతన క్రెటా ఎస్‌యూవీ కారును శుక్రవారం నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి విడుదల చేశారు. నార్కట్‌పల్లి-అద్దంకి రోడ్డులోని ఆర్జాల బావి వద్ద సన్ సాయి హుండాయి షోరూంలో సంస్థ ఎండీ వినీలారెడ్డివిజయ్‌మోహన్ శివంలతో కలిసి ఆమె మాట్లాడారు. జిల్లా వినియోగదారులకు అందుబాటులో నూతన కార్లను ఉంచడం అభినందనీయమన్నారు. డీజిల్, పెట్రోల్ వర్షన్‌లో నూతన కార్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



సాయిరాం మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. చివ్వెంల, చిట్యాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఖమ్మంపాటి సాయిరాం (25), కుడకుడ గ్రామానికి చెందిన బామ్మర్ చైతన్యలు ఫెస్టిసైడ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. గురువారం కోదాడకు బైక్‌పై వెళ్లి రాత్రి తిరిగి సూర్యాపేటకు వస్తుండగా మార్గమధ్యలో దురాజ్‌పల్లి వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీట్టింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సాయిరాం మృతి చెందాడు. చైతన్య తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఆమె గర్భవతి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

చిట్యాల: రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన రుద్రారపు మల్లేష్(40) శుక్రవారం రాత్రి చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలు సేకరిస్తున్నారు. కాగా మల్లేష్ పెద్దకాపర్తి గ్రామానికి ఎందుకు వచ్చాడు, ఎక్కడికి నడుచుకుంటూ వెళుతున్నాడు.? అనే వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంచార పశు వైద్య సేవలు వినియోగించుకోవాలి

- జీవీకే ఈఎంఆర్ఐ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి డాక్టర్ భగీస్ మిశ్రా



రికార్డులు తనఖీ చేస్తున్న రాష్ట్ర ప్రాజెక్టు అధికారి డాక్టర్ భగీస్ మిశ్రా

హుజూర్‌నగర్ : పాడి రైతులు అందుబాటులో ఉన్న సంచార పశు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని జీవీకే ఈఎంఆర్ఐ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి డాక్టర్ భగీస్ మిశ్రా సూచించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ప్రాంతీయ పశువైద్యశాలలో గల 1,962 సంచార పశు వైద్య వాహనాన్ని పరిశీలించి రికార్డులను తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో 4 పశు వైద్య సంచార వాహనాలు ఉన్నాయని తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల పశుపోషకులు ఈ వాహనాన్ని సద్వినియోగం చేసుకొని, పశువుల ఆరోగ్యాన్ని, పశు సంపదను పెంచుకోవాలని కోరారు. పశు సంపదను పెంచితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆయన పేర్కొన్నారు. పశువులకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని సంచార పశువైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీపీఎం నజీరుద్దీన్, ఈఎంఈ సోమేశ్వర్, సంచార పశువైద్య సిబ్బంది డాక్టర్ ప్రశాంత్, సిబ్బంది నజీర్, నగేష్, గోపి పాల్గొన్నారు.

స్టీరింగ్‌పైనే ఆగిన డ్రైవర్ గుండె

- రామన్నపేటలో లారీ డ్రైవర్ హఠాన్మరణం
- మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వాసి



వీరభద్రరావు(ఫైల్)



స్టీరింగ్‌పై పడిపోయిన డ్రైవర్ వీరభద్రరావు

రామన్నపేట : ఓ లారీ డ్రైవర్ గుండె స్టీరింగ్‌పైనే ఆగిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల కేంద్రానికి చెందిన ఎల్లంకి వీరభద్రరావు(51) 15ఏళ్లుగా లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున సంగారెడ్డి జిల్లా చేగుంటలో కోళ్ల దాణాను లోడ్ చేసుకొని క్లీనర్ పిల్లలమర్రి రాజుతో కలిసి స్వస్థలానికి బయలుదేరాడు. ఒంట్లో నలతగా ఉందని చెప్పి భువనగిరి నుంచి లారీని స్పీడ్ తగ్గించి నడిపాడు. ఉదయం 9.30 గంటల సమయంలో రామన్నపేటకు చేరుకొని రోడ్డు పక్కన లారీ ఆపి ఇద్దరు టిఫిన్ చేశారు. డ్రైవింగ్ సీటులో కూర్చొని స్టీరింగ్‌పై తలవాల్చి డ్రైవర్ వీరభద్రరావు, పక్క సీట్లో క్లీనర్ రాజు నిద్రపోయారు. మధ్యాహ్న సమయంలో క్లీనర్ మంచినీళ్లు తెచ్చి బయలు దేరేందుకు డ్రైవర్ వీరభద్రరావును లేపడానికి పిలిచాడు. ఎంత పిలిచినా పలుకక పోవడంతో స్థానికుల సహాయంతో 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు సాయి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తడకమళ్ల పీఏసీఎస్‌లో వీగిన అవిశ్వాసం

- సమావేశానికి హాజరుకాని సభ్యులు



కార్యాలయంలో సభ్యుల కోసం వేచి చూస్తున్న అధికారులు

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు సభ్యుల కోసం వేచి చూసినా ఎవరూ రాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా సహకార సంఘం అధికారి ఆర్.కిరణ్‌కుమార్ ప్రకటించారు. ఈ సొసైటీలో 13 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 9మంది సభ్యులు.. చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని గత ఏడాది డిసెంబర్ 20న జిల్లా అధికారికి నోటీసు అందజేశారు. దీంతో సదరు అధికారి ఈ నెల 18(గురువారం)న అవిశ్వాస తీర్మానానికి 13 మంది సభ్యులు హాజరు కావాలని నోటీసులు జారీచేశారు. అయితే, అనారోగ్య కారణాలతో జిల్లా అధికారి సమావేశాన్ని గురువారం వాయిదా వేశారు. తిరిగి శుక్రవారం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సమావేశం నిర్వహించగా సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు.

సొసైటీలో 13 మంది సభ్యులు

ఈ సొసైటీలో 13 మంది సభ్యుల్లో ఐదుగురు కాంగ్రెస్, నలుగురు సీపీఎం, నలుగురు బీఆర్ఎస్ మద్దతుదారులు ఉన్నారు. బీఆర్ఎస్, సీపీఎం మద్దతుదారులు కలిసి చైర్మన్‌గా బీఆర్ఎస్ మద్దతుదారుడు పాదూరి సంజీవరెడ్డి, వైస్ చైర్మన్‌గా సీపీఎం మద్దతుదారుడు వీరేపల్లి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన ఒకరు కాంగ్రెస్‌లో చేరడంతో వారి సంఖ్య ఆరుకు చేరుకుంది. వారు సీపీఎంకు చెందిన మరో ముగ్గురు మద్దతుదారులతో కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి తెరలేపారు.

సరిపడా మద్దతు లేకనే..

అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సమావేశం నిర్వహించగా అవిశ్వాస తీర్మానం పెట్టిన 9 మంది సభ్యుల్లో ఒకరైన బీఆర్ఎస్ మద్దతుదారుడు తమ వైపునకు తిప్పుకుని క్యాంపునకు తరలించారు. వారు సమావేశానికి హాజరుకాలేదు. అయితే అవిశ్వాసం నెగ్గాలంటే 2/3 వంతు అంటే.. కచ్చితంగా 9 మంది సభ్యులు కావాలి. కాంగ్రెస్ మద్దతుదారులు 8 మంది సభ్యులు మాత్రమే ఉండడంతో అవిశ్వాసం వీగిపోతుందని ఆలోచనతో వారు కూడా సమావేశానికి హాజరు కాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా అధికారి ప్రకటించారు. ఈ అవిశ్వాస సమావేశానికి డీఎస్పీ వెంకటగిరి పర్యవేక్షణలో ఒక సీఐ, నలుగురు ఎస్ఐలు, 50 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి రాంబాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి, జూనియర్ అసిస్టెంట్ సుజాన్, సీఈఓ నర్సయ్య పాల్గొన్నారు.